క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

• ఇన్‌చార్జ్ సీడీపీఓ ప్రసన్న



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులతో ఇన్‌చార్జ్ సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: బాలలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఇన్‌చార్జ్ సీడీపీఓ జి.ప్రసన్న అన్నారు. బుధవారం స్థానిక కేంద్రియ విద్యాలయంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆట పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.ఎర్రయ్యమ్మ, సోషల్ కౌన్సిలర్ రమాదేవి, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ దిలీప్ మోదీ, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన అభివృద్ధి పనులు



ద్వారపూడిలో నత్తనడకన సాగుతన్న సీసీ డ్రెయిన్ పనులు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడిలో ఉపాధిహామీ నిధులు రూ.14 లక్షలతో చేపడుతున్న సీసీ డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాజావీధి, పెద్దకాపు వీధి ప్రాంతాల్లో అభివృద్ధి పేరుతో ఇళ్ల ముందుభాగం తొలగించి నెల రోజులవుతన్నా ఇప్పటికీ కాలవల నిర్మాణం చేపట్టకపోయే సరికి స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు రోడ్డుపైనే మురుగు పేరుకుపోవడం, మరోవైపు ఇంటి ముందు శిథిలాలు ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంపు



ఎక్సైజ్ సీఐ వెంకటరావు

నెల్లిమర్ల: మండలంలో మద్యం షాపు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గడువు పెంచిందని ఎక్సైజ్ సీఐ ఎం. వెంకటరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కల్లుగీత కులస్తుల కోసం కేటాయించిన షాపు ఏర్పాటుకు ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. దరఖాస్తుదారులు తమ కుల, నివాస ధ్రువీకరణపత్రం, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను నెల్లిమర్ల ఎక్సైజ్ స్టేషన్‌లో ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని కోరారు.

భోగాపురం స్టేషన్ పరిధిలో రెండు..

పూసపాటిరేగ: భోగాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కార్మికులకు రెండు మద్యం దుకాణాలు కేటాయించారు. ఔత్సాహికులు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. అప్లికేషన్‌తో పాటు రెండు లక్షల రూపాయల చలానా/డీడీ, కులం, ఆధార్ జిరాక్స్‌లు సమర్పించాలి.

రైస్‌మిల్లు తనిఖీ



రైస్ మిల్లును పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్, సివిల్ సప్లైడీఎం మీనాకుమారి

విజయనగరం అర్బన్: నగర పరిధిలోని కేఎల్ పురంలో ఉన్న రామలక్ష్మణ ట్రేడర్స్ రైస్ మిల్లును జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని ధాన్యం నిల్వలను, రికార్డులను పరిశీలించారు. విద్యుత్ మీటర్, విద్యుత్ బిల్లులను తనిఖీ చేశారు. అలాగే మిల్లింగ్‌పై ఆరా తీశారు. అనంతరం సమీపంలోని భారత ఆహార సంస్థ గోదాములను పరిశీలించారు. పర్యటనలో సివిల్ సప్లైస్ డీఎం కె.మీనాకుమారి, సీఎస్‌డీటీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి

చీపురుపల్లి: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీ బి.బంగారమ్మ సూచించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో వీఓఏలకు సూర్యఘర్ పథకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లోని ప్రతీ మహిళ పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇంటిపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసు కోవాలన్నారు.సెర్ప్ ప్రతినిధులు టి.రాజేష్‌వర్మ, బి.వెంకటేష్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో 1.65 కిలోవాట్స్, 2.2 కిలోవాట్స్, 3.3 కిలోవాట్స్ సామర్థ్యంతో మూడు రకాల సోలార్ ప్లాంట్లు ఉన్నాయని చెప్పారు. ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

• కమ్మేసిన పొగమంచు..





విజయనగరం - బొబ్బిలి రహదారిలో కురుస్తున్న మంచు

విజయనగరం పట్టణాన్ని పొగమంచు కొద్ది రోజులుగా కుమ్మేస్తోంది. ఉదయం పది గంటల వరకు మంచు కురుస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. విజయనగరం – బొబ్బిలి రహదారిలో బుధవారం ఉదయం తొమ్మిది గంటల వరకు విపరీతమైన మంచు కురవడంతో రాకపోకలకు వాహన చోదకులు, బాటసారులు ఇబ్బంది పడ్డారు. వాహన చోదకులు లైట్లు వేసుకుని మరీ రాకపోకలు సాగించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పెరుగుతున్న డయేరియా కేసులు

• సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. గుర్ల మండలంతో పాటు పలు మండలాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయి. విజయనగరం మండలంతో పాటు బొండపల్లి మండలానికి చెందిన వారు డయేరియా లక్షణాలతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతున్నారు. విజయనగరం మండలం పినవేమలి గ్రామానికి చెందిన ఒకే ఇంట్లో ముగ్గురు డయేరియా బారినపడ్డారు. వీరిలో అలబోను సింహాచలం, చైతు, శ్యామల ఉన్నారు. వీరిలో శ్యామల, చైతు డయేరియా నుంచి కోలుకుని ఇంటికి వెళ్లిపోగా.. సింహాచలం ఇంకా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరి కొంతమంది కూడా ఈ గ్రామంలో డయేరియా బారిన పడి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. విజయనగరం మండలం కొండకరకాంనకు చెందిన ఎల్. బంగారయ్య, గాజులరేగకు చెందిన ఎల్లారావు డయేరియాతో ఇదే ఆస్పత్రిలో చేరారు. అదేవిధంగా బొండపల్లి మండలం అంబటివలసకు చెందిన ఎస్.వెంకటేష్ కూడా డయేరియాతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అధికారులు స్పందించి డయేరియా ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలి

• నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



17వ డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటనలో నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 17వ డివిజన్‌లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అక్కడక్కడ ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. వీధి కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు రెండు బుట్టల విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగేంచేలా రోడ్లపై వ్యాపారాలు చేయకూడదని చిరు వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి, టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, పారిశుధ్య పర్యవేక్షకుడు అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన

విజయనగరం టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక చట్టాలకు నిరసనగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు బుధవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆలుగు వెంకటరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలిని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తే సహించేంది లేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, కృష్ణకుమారి తామాడ, రమణమ్మ, అక్కమ్మ, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊపిరి పోసేది కళాకారులే..

• గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న




సత్కారం పొందుతున్న కళాకారుడు

విజయనగరం అర్బన్: వివిధ సమస్యలపై ప్రజలను చైతన్యపరిచే ఉద్యమాలకు కళాకారులే ఊపిరి పోస్తారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న అన్నారు. ప్రజా కళాకారులు డాక్టర్ గరికపాటి రాజారావు, పద్మశ్రీ షేక్ నాజర్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయంలో జరిగిన కళాకారుల సత్కారం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారులు తమ ప్రదర్శన ద్వారా సమాజానికి అవసరమైన మంచి సందేశాలను తెలియజేస్తారని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకంగా నిలుస్తుందన్నారు. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. 15 మంది సభ్యులతో కూడిన జిల్లా నవ్యాంధ్ర ప్రజా మండలి కమిటీని ప్రకటించారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా గంధ్రేటి శ్రీను (డప్పు శ్రీను), కార్యదర్శిగా మన్నెపురి అప్పలనాయుడు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘ జిల్లా అధ్యక్షుడు పి.షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి దూరం...


• మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్



ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంవీఐ రవిశంకర్, తదితరులు

విజయనగరం క్రైమ్: వాహనడ్రైవర్లు ఒత్తిడికి దూరంగా ఉన్నప్పుడే ప్రమాదాలను నివారించగలమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంపైన ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో ఏపీపీటీడీ హయ్యర్ బస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ ప్రభావం, వెహికల్ కండీషన్, భౌతిక పరిస్థితుల ఆధారంగా ప్రమాదాలు జరుగుతాయన్నారు. అయితే డ్రైవర్ ఏకాగ్రత కోల్పోకుండా ఉంటే 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ప్రయాణికులు, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. అనేక సందర్భాల్లో డ్రైవర్లు అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల ఎన్నో ప్రమాదాలు తృటిలో తప్పాయని తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడపవద్దని సూచించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు జీఎస్ఎస్ రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యనారాయణ, వి.రాములు, ఎ.జగన్మోహనరావు, ట్రాఫిక్ ఎస్సై భాస్కరరావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు మధు, వాసు, జిల్లా కోశాధికారి కోటి, డ్రైవర్లు పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని కర్మాగారాలు, హోటళ్లు, గృహాలు, వాణిజ్య సముదాయాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారంలోగా కచ్చితమైన నివేదిక అందజేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గుర్తించిన బాల కార్మికులకు పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పని చేయించుకుంటున్న సంస్థలకు అపరాధ రుసుం విధించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, కార్మికశాఖ ఉప కమిషనర్ ప్రసాదరావు, జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు..

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో నెల్లిమర్ల అమరవీరుల 31వ వర్ధంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరవీరులకు నివాళిగా ఐఎఫ్‌టీయూ పతాకాన్ని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి యూనియన్ కార్యాలయ ఆవరణలో ఎగురవేశారు. అమరులైన కాళ్ల అప్పల సత్యనారాయణ, నల్లి ముత్యాల నాయుడు, దువ్వారపు చిన్న, కోళ్ల అచ్చెప్పడు, కల్లూరి రాంబాబు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐఎఫ్‌టీయూ అనుబంధ నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మిక సంఘం (176/74) సీనియర్ ఆఫీస్ బేరర్ నామాల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆనాడు నెల్లిమర్ల అమరవీరుల ప్రాణత్యాగం కార్మికవర్గంపై పాలకులు చేపట్టిన హక్కుల దాడిని నిరోధించిందన్నారు. కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం జాతీయ నాయకుడు జీడి సారయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రొంగలి అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గీత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు డి. ఏడుకొండలు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

విజయనగరం పూల్‌బాగ్: ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలం నాడు కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి.. యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం సరికాదన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ. జగన్ మోహనరావు మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే 8 గంటల పని దినం ఉండదని.. 12 నుంచి 16 గంటలు పనిచేసే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రవికుమార్, బి. రమణ, వి. రాములు, భగవాన్, సుధీర్, భాస్కరరావు, మహాలక్ష్మి, నాగమ్మ, అప్పయ్యమ్మ, సురేష్, సుజాత, తదితరుల పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురు అరెస్ట్



నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్సై ప్రసన్న కుమార్

విజయనగరం క్రైమ్: నగరంలోని తోటపాలెం వైఎస్సార్ కాలనీలో ఇటీవల చోటుచేసుకున్న తగాదాకు సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్‌నగర్లో ఉద్యోగరిత్యా అద్దెకు ఉంటున్న పల్లి బాలకృష్ణ ఈ నెల రెండో తేదీన రాత్రి ఇంటి బయట ఉండగా.. అటువైపు వచ్చిన కొందరు యువకులు మద్యం మత్తులో బాలకృష్ణతో గొడవపడి గాయపరిచారు. అలాగే అతని ద్విచక్ర వాహనం లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై ప్రసన్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో నిందితులైన తోటపాలెంనకు చెందిన చెల్లూరి భార్గవ్ అతని స్నేహితులైన చెల్లూరు చంద్రశేఖర్, బొత్స మహేష్ కుమార్, కె. శివప్రసాద్ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

రక్తదానం..



విజయనగరంలోని ఓ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ టెక్నీషియన్‌గా పని చేస్తున్న బి. సుభాష్‌కుమార్ 56వ సారి రక్తదానం చేశారు. తన తండ్రి జ్ఞాపకార్థం బుధవారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేయడంతో పలువురు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో గాంధీజీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

సందడిగా 'ఫేర్‌వెల్'

నెల్లిమర్ల మండల కేంద్రంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఇంటర్ విద్యార్థులకు జూనియర్లు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ మాట్లాడుతూ, భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లెంక సంధ్య, అప్పారావు, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల



పరామర్శ..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం విద్యార్థినులను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు బుధవారం పరామర్శించారు. కలుషిత ఆహారం తినడంతో విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి కేసలి సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖాధికారి రామానుజం, డీసీపీయూ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్



విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జొన్నాడ, దువ్వపేట, గొలగానిపేట, ఆకులపేట, డి.తాళ్లవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.